కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌ / వనస్థలిపురం రైతుబజార్‌లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 23, వంకాయ రూ. 40, బెండ రూ. 40, పచ్చిమిర్చి రూ. 28, కాకరకాయ రూ. 23, బీరకాయ రూ. 35, క్యాలీఫ్లవర్‌ రూ. 23, క్యాబేజీ రూ. 31, క్యారెట్‌ రూ. 65, దొండ రూ. 23, ఆలుగడ్డ రూ. 37, ఉల్లిగడ్డ రూ. 45, గోకరకాయ రూ. 28, దోసకాయ రూ. 23, సొరకాయ రూ. 15, పొట్లకాయ రూ. 18, అరటికాయ రూ. 9, చిక్కుడుకాయ రూ. 60, చామగడ్డ రూ. 35, మునగ రూ. 55, చిలుకడ దుంప రూ. 65, బీట్‌రూట్‌ రూ. 45, కీర రూ. 17, బీన్స్‌ రూ. 50, క్యాప్సికమ్‌ రూ. 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలోని 33/11 కేవీ విద్యుత్‌ ఫీడర్‌ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పటేల్‌నగర్‌, శిఖరాఎన్‌క్లేవ్‌, ఆర్‌టీసీ, వైశాలీనగర్‌, నాగార్జున, కటకోనికుంట, భానునగర్‌, కేశవనగర్‌, ఎస్‌ఎన్‌రెడ్డి, సింగరేణి కాలనీలలో విద్యుత్‌ ఉండదన్నారు.

◆ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వినయ్‌నగర్‌, సంతోష్‌నగర్‌, సెంట్రల్‌ ఎక్స్ఛేంజ్‌, డీఎస్‌, రోషన్‌విహార్‌, ముస్లీంబస్తీ, మారుతీనగర్‌, యాదగిరినగర్‌, దుర్గాభవానీనగర్‌, సుల్తానాఅల్వా, బస్తీ దవాఖానా ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపి వేస్తామని ఏఈ వివరించారు.

పేదలకు అండగా ఉంటాం

అంబర్‌పేట: పేదలకు అండగా ఉండేందుకు నిత్యం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ అన్నారు. సీఎం రిలీఫ్‌ ఫండ్‌ పథకం కింద 25 మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శుక్రవారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. రూ.9.10 లక్షల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో పేదలకు అండగా ఉంటామన్నారు. వారికి ప్రభుత్వ పథకాలు అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని అన్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.


కర్మన్‌ఘాట్‌లో పూజల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్‌


సహారాస్టేట్స్‌ కాలనీలోని లలితా నాగలింగేశ్వరస్వామికి...


ఉసిరి చెట్టు కింద కార్తీక దీపారాధన చేస్తున్న భక్తులు

కార్తీక పౌర్ణమి వేళలో...

మన్సూరాబాద్‌: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఎల్‌బీనగర్‌లోని పలు శైవక్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఆలయాల వద్ద కార్తీక దీపారాధన చేశారు.

చంపాపేట డివిజన్‌ పరిధిలో...

చంపాపేట: కార్తీక పౌర్ణమి సందర్భంగా చంపాపేట డివిజన్‌ పరిధిలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆలయాలకు హాజరై భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కర్మన్‌ఘాట్‌ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయానికి మంత్రి పొన్నం ప్రభాకర్‌, జిల్లా జడ్జి నాగశ్రావ్య, స్థానిక కార్పొరేటర్‌ వంగ మధుసూదన్‌రెడ్డి వేర్వేరుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రాలతో వారిని ఆశీర్వదించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లావణ్య, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్‌ నల్లా రఘుమారెడ్డి, తిరుమలేష్‌, నాయకులు బద్రీనాథ్‌, సామ రమణారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, దశరథగౌడ్‌, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మలక్‌పేట హరిహర క్షేత్రంలో...

శివగంగా కాలనీలో...

నాగోలు: కొత్తపేట డివిజన్‌ శివగంగా కాలనీలో సదా శివాలయంలో శుక్రవారం దీపారాధనతో శివుడికి పూజలు నిర్వహించారు. దేవాలయంలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. కొత్తపేట కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌ కుమార్‌ పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో ఆకాశ దీపం ఏర్పాటు చేశారు. కాలనీ అధ్యక్షుడు లక్ష్మీపతి గౌడ్‌, అంబాల మల్లేష్‌ గౌడ్‌, కోర్లపల్లి స్వామి, నీలకంఠం రమేష్‌, నాయకులు తోట మహేందర్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో...

మలక్‌పేట: దయానంద్‌నగర్‌ పల్టాన్‌లోని హరిహర క్షేత్రం, మైసమ్మ దేవాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్ధతో నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ, ఫౌండర్‌ చైర్మన్‌ నూగూరు రమేష్‌గుప్తా, కమిటీ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

దిల్‌సుఖ్‌నగర్‌: కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం మహేశ్వరం నియోజవర్గం శ్రీ రామకృష్ణా పురం డివిజన్‌ శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణాపురం డివిజన్‌ కాంగ్రెస్‌ నాయకులు పున్న నిర్మలా గణేష్‌ నేత పాల్గొన్నారు. ఆలయ ఈఓ ఉమారాణి, నాయకులు తలాటి రమేష్‌, పగిళ్ల భూపాల్‌ రెడ్డి, శ్యామ్‌ సుందర్‌ రావు, ఎల్లన్న, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.


కర్మన్‌ఘాట్‌ ఆలయ కోనేరులో పూజలు నిర్వహిస్తున్న ఈఓ లావణ్య


శివగంగా కాలనీలో కార్పొరేటర్‌ పవన్‌కుమార్‌


నాగోలు డివిజన్‌ శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి దేవాలయ ప్రాంగణంలోని కాశీవిశ్వేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కర్మన్‌ఘాట్‌ అయ్యప్ప ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను చేస్తున్న భక్తులు

నేడు శాలివాహననగర్‌లో 'బీజేపీ ఒక రోజు నిద్ర'

హాజరు కానున్న ఎంపీ డాక్టర్‌ లక్ష్మణ్‌

మలక్‌పేట: మూసీ బాధితులకు అండగా ఉండి వారికి భరోసా కల్పించడానికి బీజేపీ ఆధ్వర్యంలో మూసీనది పరీవాహక ప్రాంత బస్తీలలో ఒక రోజు నిద్ర చేయనున్నట్లు ఆ పార్టీ భాగ్యనగర్‌ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎంపీ డాక్టర్‌ లక్ష్మణ్‌, రాష్ట్ర నేతలు, నాయకులు మూసారంబాగ్‌ డివిజన్‌ శాలివాహనగర్‌ మూసినది తీరప్రాంత బస్తీలలో పర్యటిస్తారని తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటలకు వరకు బస్తీలో ఉంటారని తెలిపారు. బాధితుల సమస్యలు తెలుసుకుని, బస్తీలో భోజనం చేసి అక్కడే రాత్రి నిద్ర చేస్తారని తెలిపారు. మూసీనది ప్రాంతాలలో ఏవరైనా నాయకులు ఉండగల్గుతారని సీఎం రేవంత్‌రెడ్డి హేళనగా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మూసీ తీరప్రాంతాలలో ఒకరోజు నిద్ర కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. నేతలు సందడి సురేందర్‌రెడ్డి, బొక్క మధుసూదన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, దినేష్‌ కొప్పుల, సురేందర్‌, తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపులో సీసీ కెమెరాల పాత్ర కీలకం


ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ లచ్చిరెడ్డి, ఏసీపీ కాశిరెడ్డి

ఎల్‌బీనగర్‌: నేరాలను అదుపు చేసేందుకు.. నేరాలు జరిగినప్పుడు నిందితులను సత్వరమే అరెస్టు చేసేందుకు సీసీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటుందని బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి అన్నారు. టీచర్స్‌ కాలనీ ఫేజ్‌–2లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కార్పొరేటర్‌ ఏసీపీ కాశిరెడ్డితో కలసి ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కార్పొరేటర్‌ రూ. 50వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్‌లు శ్రీనివాస్‌, నాగరాజు, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, నాయకులు శివముదిరాజ్‌, రామకృష్ణరెడ్డి, మహిపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పాండురంగారెడ్డి, రామరావు, రాంరెడ్డి, జలంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పార్టీలోనే కార్యకర్తలకు గుర్తింపు

సైదాబాద్‌: పార్టీ పటిష్టతకు కృషి చేసే కార్యకర్తలకు కాంగ్రెస్‌లోనే తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ కనకాల శివాజీ కురుమ అన్నారు. రెండు రోజుల క్రితం ప్రభుత్వం ప్రకటించిన హైదరాబాద్‌ మార్కెట్‌ కమిటీలో ఆయన అవకాశం పొంది బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మార్కెట్‌ కమిటీలో పనిచేస్తానని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా కృషి చేస్తానన్నారు. రైతులకు మార్కెట్‌లో మెరుగైన వసతులు కల్పించడానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. తనకు మార్కెట్‌ కమిటీలో అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న బస్తీవాసులు

మలక్‌పేట: అక్బర్‌బాగ్‌ డివిజన్‌ పరిధి సపోటాబాగ్‌లో శుక్రవారం కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి బస్తీ నాయుకులు భూమి పూజ చేశారు. కమ్యూనిటీహాల్‌ ఏర్పాటుకు రూ.14 లక్షలు నిధులు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కమ్యూనిటీ హాల్‌ అందుబాటులోకి వస్తే బస్తీవాసులకు ప్రయోజకరంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పటాలె నవీన్‌ కుమార్‌, దశరథ్‌, మేడి రాజు, నర్సింగ్‌, గౌస్‌, అశోక్‌, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా


మలక్‌పేట హోరేబు చర్చి సమీపంలో వృథా అవుతున్న నీరు

మలక్‌పేట: లీకేజీలతో తాగునీరు రోడ్ల పాలవుతున్న అధికారుల మాత్రం పట్టించుకోవడం లేదు. కాలనీలలో ఎక్కడ చూసినా లీకేజీలే దర్శనమిస్తున్నాయి. పైప్‌లైన్‌ లీకేజ్‌, వాల్వ్‌ వద్ద లీకేజీలతో తాగునీరు వృథా పోతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేనికారణంగా వందలకొద్ది గ్యాలన్ల మంచి నీరు రోడ్లపై వరదలై పారుతున్నాయి. లోప్రెషర్‌, నీటి సరఫరా సరిగాలేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. నీటి సద్వినియోగం చేయడంలో అధికారులు విఫలం అవుతున్నారు. అస్మాన్‌ఘడ్‌ వాటర్‌ వర్క్స్‌ పరిధిలోని అక్బర్‌బాగ్‌ డివిజన్‌ హోరేబు చర్చి సమీపంలో మ్యాన్‌హోల్‌ వద్ద వాల్వ్‌ లీకేజీతో ఈ దుస్థితి నెలకొంది. ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. రోజుల తరబడి సమస్యను పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లీకేజీలను అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బతుకమ్మ కుంటపై స్టేటస్‌కో

అంబర్‌పేట: అంబర్‌పేట బతుకమ్మ కుంట స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకునే చర్యలపై న్యాయస్థానం స్టేటస్‌కో విధించింది. రెండు వారాల పాటు స్థలం యథావిధిగా ఉండి అందులో ఎలాంటి చర్యలు చేపట్టొద్దని న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసినట్లు బీఆర్‌ఎస్‌ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఛే–నంబర్‌ చౌరస్తాలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ.. ప్రైవేటు స్థలమని తాము పత్రాలు చూయించినప్పటికీ హైడ్రా తామకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా స్వాధీనం చేసుకునే చర్యలకు ఉపక్రమించిందన్నారు. హైడ్రా చర్యలపై తాను న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో స్టేటస్‌ కో వచ్చినట్లు ఆయన వెల్లడించారు. కొద్ది మంది వ్యక్తులు హైడ్రా కమిషనర్‌కు తప్పుదారి పట్టిస్తున్నారని ఎడ్ల సుధాకర్‌రెడ్డి వాపోయారు. న్యాయస్థానంపై విశ్వాసంతో తాము పోరాడుతామని పేర్కొన్నారు.

ఆరోగ్యకర జీవన శైలిని అలవర్చుకోవాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్‌ రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్‌: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌కేపురం డివిజన్‌ కార్పొరేటర్‌ రాధా ధీరజ్‌రెడ్డి అన్నారు. ఆర్‌కేపురం అల్కాపురికాలనీలో రైట్‌ నక్షత్ర హాస్పిటల్స్‌ (సూట్స్‌ కేర్‌ నెట్వర్క్‌)లో వరల్డ్‌ డయాబెటిస్‌ డే సందర్భంగా మధుమేహంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్‌ రాధా ధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ... డయాబెటిస్‌ ఉన్న వారికి ఆహార నియమాలు, రోజు వారీ వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవన శైలి పట్ల పూర్తి అవగాహన అవసరం అన్నారు. ఈ సందర్భంగా ఉచితంగా డయాబెటాలజిస్ట్‌ కన్సల్టేషన్‌, రాండయ్‌ బ్లడ్‌ షుగర్‌, ఇతర రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి డయాబెటిస్‌ పేషెంట్‌కు ప్రత్యేకంగా ఒక సంవత్సరం పాటు ఉచిత ఓపీ కన్సల్టేషన్‌ కార్డును అందజేశారు. రాచకొండ పోలీస్‌ షీ టీమ్స్‌ డీసీపీ ఉషారాణి, రైట్‌ నక్షత్ర హాస్పిటల్స్‌ వైద్యులు శివరామకృష్ణ, ఉజ్వల్‌, వంశీ చంద్రరాజు, శిరీష, మహబూబ్‌ బాషా, చంద్రప్రకాష్‌, నవ్య, సాయినాథ్‌, రాజ్‌కుమార్‌, దీవెన, ఝాన్సీ, హర్ష, ఉషా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు జన్మదిన శుభాకాంక్షలు

చాదర్‌ఘాట్‌: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌, కో ఆపరేటివ్‌, టెక్స్‌టైల్‌ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావుకు టీఎస్‌జీఓ మార్కెట్‌ కమిటీ ఉద్యోగుల కేంద్ర సంఘం ప్రతినిధులు శుక్రవారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలక నర్సింహారెడ్డి, కార్యదర్శి ముక్రం, ఎస్‌జీఎస్‌ దామోదర్‌, సంతోష్‌, ఎల్‌.శ్రీనివాస్‌, శ్రీనివాసరెడ్డి, కాలిద్‌, వెంకన్న పాల్గొన్నారు.



ముంపు సమస్య లేకుండా చర్యలు

ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


రైతులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్‌: కాలనీలలో వరద ముంపు సమస్య లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని, ట్రంక్‌ లైన్‌ పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా స్థానికులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధిలోని క్రిస్టల్‌ ఎవెన్యూ సమీపంలో రైతుల పొలాల నుంచి ట్రంక్‌ లైన్‌ వెళ్తున్నది. దీన్ని రైతులు అంగీకరించకపోవడంతో ఎమ్మెల్యే శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అధికారులు, రైతులతో సమావేశం అయ్యారు. తమ పొలాలు పోతున్నందున తమకు నష్ట పరిహారం చెల్లించాలని రైతులు అధికారులు, ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సాగర్‌ కాంప్లెక్స్‌ నుంచి వచ్చే వరద కాప్రాయి చెరువుకు పోకుండా గుర్రంగూడ అటవీ ప్రాంతం నుంచి గాయత్రి కాలనీ, పాపిరెడ్డి కాలనీ, క్రిస్టల్‌ ఎవెన్యూ కాలనీ మీదుగా పెద్దఅంబర్‌ పేట శివారులలో ట్రంక్‌ లైన్‌ కలపనున్నామని తెలిపారు. ఈ ట్రంక్‌ లైన్‌ పూర్తయితే సుమారు 21 కాలనీలకు వరద ముంపు సమస్య పరిష్కరం అవుతుందని తెలిపారు. రైతులకు ఏ విధంగా నష్ట పరిహారం చెల్లిస్తే బాగుంటుంది అనే విషయంపై అధికారులతో చర్చించడం జరిగిందని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వంతో మాట్లాడి నష్ట పరిహారం చెల్లించి అన్ని విధాలా ఆదుకుంటామని ఆయన హామీచ్చారు. ఎల్‌బీనగర్‌ జోన్‌ సిటీ ప్లానర్‌ శ్రీనివాస్‌ యాదవ్‌, టౌన్‌ ప్లానింగ్‌ ఏసీపీ శ్యామ్సాన్‌, బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పార్టీలోనే కార్యకర్తలకు గుర్తింపు


మల్‌రెడ్డి రాంరెడ్డిని సన్మానిస్తున్న గాంధీ నాయక్‌

నాగోలు: కాంగ్రెస్‌ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని రాష్ట్ర రోడ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్‌ చైర్మన్‌ కె.గాంధీ నాయక్‌ రోడ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మల్‌రెడ్డి రాంరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్‌ పార్టీలో విశేష సేవలు అందించిన నాయకులకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఎస్టీ సెల్‌ కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌ నాయక్‌ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి అదృశ్యం

నాగోలు: ఎల్‌బీనగర్‌ జోన్‌ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు అదృశ్యమయ్యారు. నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బండ్లగూడ న్యూ అజయ్‌నగర్‌ కాలనీకి చెందిన బైండ్ల యాదమ్మ కుమార్తె బైండ్ల నందిని(18) హయత్‌నగర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ నెల 13న నందిని కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. శుక్రవారం తల్లి యాదమ్మ నాగోలు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మరో సంఘటనలో యువతి...

నాగోలు ప్రభుత్వ పాఠశాల సమీపంలోని హనుమాన్‌ కాలనీలో నివాసం ఉండే పవార్‌ కౌసల్య కుమార్తె పవార్‌ రాజేశ్వరి(20) ఘట్‌కేసర్‌ సమీపంలో శ్రీ సాయి వద్ద కన్‌స్ట్రక్షన్స్‌ వద్ద ప్రైవేట్‌ ఉద్యోగిగా పనిచేస్తుంది. ఈ నెల 14 వ తేదీన ఉద్యోగం కోసం ఇంట్లో నుంచి వెళ్లిన రాజేశ్వరి రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. తల్లి కౌసల్య నాగోలు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

భార్యతో గొడవపడి వ్యక్తి...

లింగోజిగూడ: హయత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని హయత్‌నగర్‌ బ్లడ్‌ బ్యాంక్‌ కాలనీలో నివాసం ఉండే కొమ్ము నరేష్‌కు 2011లో దీప్తితో వివాహం అయింది. వీరికి ఇద్దరు కుమారులు. ఇంట్లో గొడవ జరిగినప్పుడు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రెండు మూడు రోజులలో తిరిగి వచ్చేవాడు. ఈ నెల 7న కూడా గొడవ జరగడంతో ఇద్దరు పిల్లలను తీసుకొని నరేష్‌ వారి అమ్మగారింటికి వెళ్లాడు. అక్కడ పిల్లలను వదిలేసిన నరేష్‌ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీప్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

1,06,500 కుటుంబాల సర్వే పూర్తి


సర్వేను పరిశీలిస్తున్న ఎల్‌బీనగర్‌ నోడల్‌ అధికారి పంకజ

ఎల్‌బీనగర్‌: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ కుల గణ సర్వే ఎల్‌బీనగర్‌ మూడు సర్కిళ్ల పరిధిలో ముమ్మరంగా జరుగుతోంది. గురువారం 26,609 ఇళ్లను సర్వే చేయగా ఇప్పటి వరకు మొత్తం 1,06,500 కుటుంబాలను సర్వే చేసినట్లు ఎల్‌బీనగర్‌ జోనల్‌ అధికారులు తెలిపారు. ఈ కుటుంబ సర్వేను ఈ నెల 30వ తేదీ వరకు పూర్తి చేయాలని లక్ష్యంతో పర్యవేక్షణ అధికారులు సిబ్బందికి సూచించారు. ఎన్యూమరేటర్ల హాజరుతోపాటు రోజు వారీగా సర్వేపై ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించాలని కోరారు. ఈ సర్వేను రోజు వారిగా పరిశీలించడానికి ఒక నోడల్‌ అధికారిని నియమించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న అడిషనల్‌ కమిషనర్‌ పంకజను నియమించారు. రోజు వారీగా జరుగుతున్న సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆమె పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేస్తున్నారు.



రోజువారీ వివరాలు ఇలా...

సర్కిల్‌	మొత్తం ఇళ్లు	ఎన్యూమరేషన్‌ బ్లాక్‌లు	పూర్తయిన ఇళ్లు
కాప్రా	98,073	859	23,534
ఉప్పల్‌	65,708	637	19,289
హయత్‌నగర్‌	84,617	639	22,076
ఎల్‌బీన గర్‌	71,948	714	22,924
సరూర్‌నగర్‌	64,696	658	20,677
మొత్తం	3,85,042	3,507	1,06,500

శివారు కాలనీలో ఇంకా వేయని స్టిక్కర్లు...

శివారు కాలనీలోతోపాటు అక్కడక్కడ కొన్ని కాలనీల ఇళ్లకు సర్వే చేసేందుకు వచ్చే అధికారులు ఇంటి ముందు ఇంకను స్టిక్కర్లు వేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని ఇళ్లకు వేసి అదే కాలనీలో ఉన్న మరి కొన్ని ఇళ్లకు పోస్టర్లు వేయక పోవడం విడ్డూరంగా ఉందంటున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515 9912220363
9505507616 9912220365